# హైదరాబాద్ ఆమ్రపాలికి!

> మొదటిపేజీ తరువాయి...

ఇలా నెలల్లోనే స్థానం మారితే ఇక పాలన ఎలా నడుస్తుందని అధికారవర్గాలే అసహనం వ్యక్తంచేస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు తరచూ జరుగుతున్నాయి. ట్రాన్స్‌ఫర్ అయినవారికే మళ్లీ బదిలీలు కావడంతో ఈ వ్యవహారం పెద్ద ప్రహసనంలా మారింది.

## ఏడు నెలలు.. అయిదు బదిలీలు

సమర్థ అధికారిగా పేరున్న ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ మరోసారి బదిలీ అయ్యారు. నవంబర్‌లో వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న ఆయనను పోలింగ్ సమయానికి వీఆర్‌లో పెట్టారు. డిసెంబర్‌లో హైదరాబాద్ సిటీ క్రైమ్ జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. మార్చిలో మరోసారి మల్టీ జోన్-1 ఐజీగా బదిలీ అయ్యారు. తాజాగా ఆయనను హైదరాబాద్‌లో కొత్తగా పెట్టబోయే ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. అంటే గడిచిన ఏడు నెలల్లోనే ఆయనకు అయిదుసార్లు బదిలీ ఉత్తర్వులిచ్చారు. డిసెంబర్ వరకు ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి రిజ్వీని రేవంత్ సర్కారు వచ్చాక విద్యుత్తుశాఖకు ముఖ్యకార్యదర్శిగా నియమించింది. ఆ శాఖ తమకు అతిముఖ్యమైన విభాగమని, రిజ్వీ వంటి అధికారి ఉండాలని చెప్పి అప్పుడు బదిలీ చేసిన ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ ఆయనను విద్యుత్తు నుంచి తప్పించి వాణిజ్య పన్నుల శాఖ ముఖ్యకార్యదర్శిగా నియమించింది. డిసెంబర్‌లో రాష్ట్ర ప్రజాసంబంధాల శాఖ కమిషనర్‌గా, ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న కోరెం అశోక్‌రెడ్డిని రాష్ట్ర హార్టికల్చర్ డైరెక్టర్‌గా మార్చిలో నియమించారు. ఇప్పుడు హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు ఎండీగా బదిలీ చేశారు. అంటే ఆరు నెలల్లో మూడోసారి పోస్టింగ్ మార్చారు. కరీంనగర్ కలెక్టర్‌గా మళ్లీ పమేలా సత్పతిని పంపించారు. డిసెంబర్‌లో రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్‌గా ఉన్న ఆమెను, రేవంత్ సర్కారు కరీంనగర్ కలెక్టర్‌గా నియమించింది. ఆ తర్వాత వారం క్రితం బదిలీ చేసింది. మళ్లీ ఏమైందో ఇప్పుడు ఆమెనే తిరిగి కరీంనగర్ కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. టీఎస్ఐఐసీ ఎండీగా ఉన్న ఈవీ నర్సింహారెడ్డిని ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా రేవంత్ సర్కారు బదిలీ చేసి, ఇప్పుడు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌గా నియమించింది.

## బీసీ వెల్ఫేర్‌కు మళ్లీ మల్లయ్యభట్టు

మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శిగా కొనసాగుతున్న మల్లయ్యభట్టును గత మార్చిలోనే ప్రభుత్వం బదిలీ చేసింది. గురుకుల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలోనే హడావుడిగా ట్రాన్స్‌ఫర్ చేసింది. సమగ్ర సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు స్టేట్ డైరెక్టర్, తెలంగాణ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా నియమించింది. తాజాగా మల్లయ్యభట్టును పేరెంట్ డిపార్ట్‌మెంటైన బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కే వెనక్కి పంపించింది.

## సీడీఎంఏ.. ఆరు నెలల్లో నలుగురు

సీడీఎంఏలను మార్చడంలో కాంగ్రెస్ సర్కారు సరికొత్త రికార్డు సృష్టించింది. మున్సిపల్ శాఖలో కీలకమైన సీడీఎంఏను పదే పదే బదిలీ చేస్తున్నది. ఆరు నెలల పాలనలోనే నలుగురు సీడీఎంఏలు వచ్చారు. మున్సిపల్ శాఖలో అత్యంత కీలకమైన కమిషనర్, డైరక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ)కు కాంగ్రెస్ హయాంలో ఒక్క అధికారికీ పట్టురాకుండా పోస్టులింగ్‌లు ఇస్తున్నది. కీలకమైన మున్సిపల్ శాఖకు ఇప్పటికే మంత్రి లేరు. ముఖ్యమంత్రి వద్దే శాఖ ఉన్నది. సీఎంకు మున్సిపల్, ఇతర శాఖలు, సాధారణ పరిపాలన, కీలక విషయాల్లో బిజీగా ఉండటంతో మున్సిపల్‌పై అంతగా దృష్టి పెట్టడం లేదు. ఈ శాఖలో నిత్యం సమీక్షలు, మార్గదర్శకాలు ఉంటేనే అనేక సందేహాలు వస్తుంటాయి. అలాంటి శాఖకు మంత్రి లేకపోవడం, పూర్తిస్థాయి సీడీఎంఏ లేక ఎక్కడి పనులు అక్కడే పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడేనాటికి అర్వింద్ కుమార్ అదనపు బాధ్యతల్లో కొనసాగుతుండగా గత డిసెంబర్ 18న హరిచందనను సీడీఎంఏగా నియమించారు. ఆమె రెండు వారాలు మాత్రమే కొనసాగారు. ఈ ఏడాది జనవరి 2న దివ్య దేవరాజన్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆరు నెలలు గడువకుండానే ఆమెను సెర్ప్ సీఈవోగా బదిలీచేశారు. ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదు. వీపీ గౌతమ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. త్వరలో జరిగే బదిలీల్లోనైనా పూర్తిస్థాయి సీడీఎంఏను నియమిస్తారేమోనని అధికారులు, ప్రజాప్రతినిధులు ఎదురుచూస్తున్నారు.

- హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలి కాటకు జీహెచ్ఎంసీ కమిషనర్‌గా, కార్మిక శాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్యకు ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్ డైరెక్టర్‌గా, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపీకి పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.
- పమేలా సత్పతిని కరీంనగర్ కలెక్టర్‌గా తిరిగి నియమించగా, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా ఉన్న రమేశ్ నాయుడును డీజీపీ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని సూచించారు. ప్రొటోకాల్ డైరెక్టర్‌గా ఉన్న అర్విందర్‌సింగ్ సర్వీస్ పొడిగింపు రద్దు చేశారు.

## ఐదు పోస్టులు ఆమెకే!



ఐఏఎస్ అధికారిణి కాట ఆమ్రపాలిరెడ్డికి రేవంత్ ప్రభుత్వం ఐదు ఉన్నతస్థాయి పోస్టులు కేటాయించింది. జీహెచ్ఎంసీ కమిషనర్, మెట్రోపాలిటన్ అథారిటీ జాయింట్ కమిషనర్, మూసీ రివర్‌ఫ్రంట్ మేనేజింగ్ డైరెక్టర్, హెచ్‌జీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు డైరెక్టర్ బాధ్యతలు అప్పగించింది. ఆమ్రపాలికంటే ఎంతో మంది సీనియర్ ఐఏఎస్ అధికారులు ఉండగా, 2010 బ్యాచ్‌కు చెందిన ఆమెకు ఐదు పోస్టుల బాధ్యతలు ఇవ్వడం గమనార్హం.

### జగన్ ఇంటిముందు నిర్మాణాలు కూల్చిన అధికారికి ప్రమోషన్

ఏపీ మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇంటిముందు అక్రమ కట్టడాలు అంటూ కూల్చిన ఘటన వివాదాస్పదం కాగా తమకు తెలియకుండా జరిగిందని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్‌ను 10 రోజుల కిందట ప్రభుత్వం బదిలీచేసింది. ఇప్పుడు ఆయనకు టీఎస్ఎమ్ఎస్ఐడీసీ ఎండీగా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## ఆలిండియా సర్వీస్ అధికారుల బదిలీలు ఇలా..

| ఐఏఎస్ పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| సబ్యసాచి ఘోష్ | ముఖ్యకార్యదర్శి, యువజన సర్వీసులు | ముఖ్యకార్యదర్శి, పశుసంవర్ధక శాఖ |
| సంజయ్‌కుమార్ | వెయిటింగ్ | ముఖ్యకార్యదర్శి, కార్మిక శాఖ |
| ఏ వాణి ప్రసాద్ | ముఖ్యకార్యదర్శి, అటవీ, పర్యావరణం | ముఖ్య కార్యదర్శి, యువజన, సర్వీసులు |
| శైలజరామయ్యర్ | ముఖ్యకార్యదర్శి, సాంస్కృతిక, యూత్ అఫైర్స్ | ముఖ్యకార్యదర్శి, దేవాదాయ శాఖ |
| అహ్మద్ నదీమ్ | ముఖ్యకార్యదర్శి, ప్లానింగ్ | ముఖ్య కార్యదర్శి, అటవీ, పర్యావరణం |
| సందీప్‌కుమార్ సుల్తానియా | ముఖ్యకార్యదర్శి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ | ముఖ్యకార్యదర్శి, ఆర్థిక శాఖ |
| ఎస్ఏఎం రిజ్వీ | ముఖ్యకార్యదర్శి, ఇంధన శాఖ | ముఖ్యకార్యదర్శి, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ విభాగం |
| సుదర్శన్ రెడ్డి | ఎండీ, హైదరాబాద్ వాటర్ బోర్డ్ | కార్యదర్శి, జీఏడీ |
| జ్యోతిబుద్ధ ప్రకాశ్ | కమిషనర్, రవాణా శాఖ | కార్యదర్శి, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, హౌజింగ్ |
| ఇలంబర్తి | వెయిటింగ్ | కమిషనర్, రవాణాశాఖ |
| రొనాల్డ్ రోస్ | కమిషనర్, జీహెచ్ఎంసీ | కార్యదర్శి, ఇంధనశాఖ |
| ఏ దేవసేన | కమిషనర్, పాఠశాల విద్య | కమిషనర్, కాలేజీయేట్, టెక్నికల్ ఎడ్యుకేషన్ |
| సర్ఫరాజ్ అహ్మద్ | జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ | హెచ్ఎండీఏ కమిషనర్ |
| డీ దివ్య | డైరెక్టర్, ఎంఏయూడీ | సీఈవో, సెర్ప్ |
| హరిచందన దాసరి | వెయిటింగ్ | ప్రత్యేక కార్యదర్శి, ఆర్అండ్‌బీ |
| అలుగు వర్షిణి | డైరెక్టర్, హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ | కార్యదర్శి, గురుకులాల సొసైటీ |
| వీపీ గౌతమ్ | వెయిటింగ్ | ప్రత్యేక కార్యదర్శి, హౌసింగ్ |
| కే అశోక్ రెడ్డి | డైరెక్టర్, హార్టికల్చర్ | ఎండీ, హైదరాబాద్ వాటర్ బోర్డు |
| అనురాగ్ జయంతి | వెయిటింగ్ | ఖైరతాబాద్ జోనల్ కమిషనర్, జీహెచ్ఎంసీ |
| భవేశ్ మిశ్రా | వెయిటింగ్ | ఉపకార్యదర్శి, ఐటీ, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్స్ |
| జీ రవి | వెయిటింగ్ | ఎండీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు |
| నిఖిల | డైరెక్టర్, టూరిజం | సీఈవో, టీజీఐఆర్డీ |
| యాస్మిన్ బాషా | వెయిటింగ్ | డైరెక్టర్, హార్టికల్చర్, సెరీకల్చర్ |
| వెంకటరావు | వెయిటింగ్ | డైరెక్టర్, ప్రొటోకాల్ |
| ఉదయ్ కుమార్ | వెయిటింగ్ | సంయుక్త కార్యదర్శి, వ్యవసాయ శాఖ |
| ప్రియాంక అల | వెయిటింగ్ | డైరెక్టర్, ఫిషరీస్ |
| ఇలా త్రిపాఠి | వెయిటింగ్ | డైరెక్టర్, టూరిజం |
| పీ కాత్యాయని | సీఈవో, టీజీఐఆర్డీ | ఎండీ, ఫైనాన్స్ కార్పొరేషన్ |
| ఈవీ నర్సింహారెడ్డి | డైరెక్టర్, గిరిజన సంక్షేమం | డైరెక్టర్, పాఠశాల విద్య |
| బీ హేమంత్ సహదేవరావ్ | వెయిటింగ్ | ఎండీ, టీఎస్ఎంఎస్ఐడీసీ |
| బీ రాహుల్ | అదనపు కలెక్టర్, మంచిర్యాల | పీవో, ఐటీడీఏ |
| నిఖిల్ చక్రవర్తి | వెయిటింగ్ | ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, టీజీఐఐసీ |
| స్నేహ షబరీష్ | శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ | అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ |
| హేమంత కేశవ్ పాటిల్ | అదనపు కలెక్టర్, హైదరాబాద్ | ఎల్బీనగర్ జోనల్ కమిషనర్, జీహెచ్ఎంసీ |
| అపూర్వ చౌహాన్ | అదనపు కలెక్టర్, జోగులాంబ గద్వాల | కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ |
| అభిషేక్ అగస్త్య | అదనపు కలెక్టర్, మేడ్చల్ మల్కాజిగిరి | ఖమ్మం మున్సిపల్ కమిషనర్ |
| పీ గౌతమి | అదనపు కలెక్టర్, రాజన్న సిరిసిల్ల | జేఎండీ, మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ |
| సోనిబాల దేవి (ఐఎఫ్ఎస్) | ముఖ్య కార్యదర్శి, వైద్యారోగ్య శాఖ | ఎండీ, స్పోర్ట్స్ అథారిటీ |
| ఏవీ రంగనాథ్ (ఐపీఎస్) | ఐజీ, మల్టీజోన్-1 | కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్మెంట్, జీహెచ్ఎంసీ |
| న్యాలకొండ ప్రకాశ్‌రెడ్డి (ఐపీఎస్) | కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్మెంట్, జీహెచ్ఎంసీ | ఎండీ, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ |
| ఉపేందర్‌రెడ్డి (నాన్ క్యాడర్) | అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ | శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ |

## స్కూల్ అసిస్టెంట్ నుంచి స్కూల్ ఎడ్యుకేషన్ బాస్

హైదరాబాద్, జూన్24 (నమస్తే తెలంగాణ):ఆయన సర్కారు స్కూల్‌లో చదివారు. ప్రభుత్వ టీచర్‌గా పనిచేశారు. ఇప్పుడు అదే పాఠశాల విద్యాశాఖకు కమిషనర్‌గా నియమితులయ్యారు. ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఈవీ నర్సింహారెడ్డికిపాఠశాల విద్యాశాఖ కమిషనర్‌గా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఆయన 1989 డీఎస్సీలో జిల్లా మొదటి ర్యాంక్‌తో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) గణిత ఉపాధ్యాయుడిగా నియామకమయ్యారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్, జగదేవ్‌పూర్ మండలం మునిగడప పాఠశాలల్లో పనిచేశారు. 1995లో గ్రూప్ -1 ఉద్యోగం సాధించారు. 20 ఏండ్ల పాటు గ్రూప్ -1 అధికారిగా సేవలందించి, 2017లో కన్ఫర్డ్ ఐఏఎస్ అయ్యారు. టీఎస్ఐఐసీ ఎండీగా ఆయన సుధీర్ఘకాలం సేవలందించారు. ఈవీ నర్సింహారెడ్డి తండ్రి సైతం సర్కారు స్కూల్‌లో గెజిటెడ్ హెచ్ఎంగా పనిచేయడం గమనార్హం. ప్రభుత్వ ఉపాధ్యాయుడి కుమారుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి, సర్కారు బడిలో చదువుకుని ఇదే పాఠశాల విద్యాశాఖకు కమిషనర్ స్థాయికి ఎదిగిన నర్సింహారెడ్డిని పలువురు అభినందించారు. ప్రస్తుతం కాస్త అనారోగ్యంతో ఉన్న ఆయన, రెండు మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్టు తెలిసింది.

### రిజ్వీ బదిలీ వెనకున్నదెవరు?

ఐఏఎస్‌ల బదిలీల్లో ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, టీజీ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీని ప్రభుత్వం బదిలీచేసింది. ఆయనను ప్రభుత్వం ఎందుకు బదిలీచేసిందన్న చర్చలు సాగుతున్నాయి. మంత్రులు చెప్పినట్టు బిల్లులు చెల్లించనందుకే ఆయనపై బదిలీవేటు వేశారని ప్రచారం జరుగుతున్నది.

పలువురు విద్యుత్తు జనరేటర్లు, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని ప్రభుత్వవర్గాలు ఆయనపై ఒత్తిడి తెచ్చాయని, తమ అనుకూలురకు ఇప్పించుకునేందుకు పెద్ద లాబీయింగ్ నడిపారన్న ఆరోపణలున్నాయి. వారి ఒత్తిళ్లకు రిజ్వీ తలొగ్గకుండా మెరిట్, సీనియార్టీ ప్రతిపాదికన బిల్లులు చెల్లించే విధానాన్ని అమలుచేశారని, ఇది ప్రభుత్వ పెద్దలకు నచ్చకపోవడంతో కొందరు కక్షగట్టి బదిలీచేశారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సమర్థవంతంగా సేవలందించారు. విద్యుత్తుశాఖలో ప్రక్షాళనకు నడుంబిగించారు. బిల్లులను ఇదివరకు చెక్కుల రూపంలో చెల్లించగా, రిజ్వీ వచ్చాక ఆర్టీజీఎస్ ద్వారా నేరుగా ఆన్‌లైన్‌లో చెల్లించే పద్ధతికి శ్రీకారం చుట్టారు. రిజ్వీని ఏరికోరి విద్యుత్తు శాఖ బాధ్యతలు అప్పగించిన రేవంత్ సర్కారే తీరా అయనపై బదిలీవేటు వేసింది.

### కమిషనరే.. సమగ్రశిక్ష ఎస్పీడీ

పాఠశాల విద్యాశాఖ నుంచి సమగ్రశిక్షను వేరుచేసిన రేవంత్ సర్కారు, మళ్లీ ఇప్పుడు పాఠశాల విద్యాశాఖలోనే అంతర్భాగం చేసింది. మార్చిలో సమగ్రశిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా మల్లయ్యభట్టుకు ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఇదివరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్లకే సమగ్రశిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు ఉండేవి. కాంగ్రెస్ ప్రభుత్వం పోస్టు లేకున్నా ప్రాజెక్ట్‌ను వేరుచేసి, డైరెక్టర్‌గా మల్లయ్యభట్టును నియమించింది. తాజా బదిలీల్లో మల్లయ్యభట్టు బీసీ సంక్షేమశాఖకు బదిలీ కాగా ఎస్ఎస్ఏ ప్రాజెక్డ్ డైరెక్టర్ బాధ్యతను ఈవీ నర్సింహారెడ్డికే అప్పగించింది.

## బీసీ వెల్ఫేర్‌లో ప్రమోషన్ల కోలాహలం

- ఏడీ, జేడీ పోస్టులకు జాబితా ఫైనల్
- హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల ప్రమోషన్లపై అభిప్రాయ సేకరణ

హైదరాబాద్, జూన్24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగులకు ప్రమోషన్లను కల్పించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు, బీసీ గురుకులాలకు కలిపి 2ఏడీ పోస్టులుండగా, ప్రస్తుతం ఒకటి ఖాళీగా ఉన్నది. సీనియార్టీ ప్రకారం జేడీ చంద్రశేఖర్‌కు ఏడీగా ప్రమోషన్ కల్పించాలని నిర్ణయించారు. ఇక 3 జేడీ పోస్టులకు సీనియార్టీ ప్రకారం డిప్యూటీ డైరెక్టర్లు సంధ్య, మంజుల, విమలాదేవి పేర్లను డీపీసీ సిఫారసు చేసింది. ప్రభుత్వానికి ఇటీవలనే ప్రతిపాదనలను పంపింది. కాగా, ఇటీవలనే బదిలీపై వెళ్లిన మల్లయ్యభట్టు తిరిగి సొంత డిపార్ట్‌మెంట్‌కే బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఏడీ పోస్టు భర్తీపై సందిగ్ధత నెలకొన్నది. ఇదిలా ఉండగా బీసీ సంక్షేమ శాఖలోని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల ప్రమోషన్లపై కమిషనర్ సోమవారం హెచ్‌డబ్ల్యూవోలతో సమావేశం నిర్వహించారు. పోస్ట్‌మెట్రిక్, ప్రీ మెట్రిక్ హెచ్‌డబ్ల్యూవోలకు సీనియార్టీ జాబితాను కామన్‌గా రూపొందించాలని పట్టుబట్టినట్టు తెలుస్తున్నది. కోర్టు ఆర్డర్లకు విరుద్ధంగా కొందరికి దొడ్డిదారిన ప్రమోషన్లు ఎలా ఇస్తారని నిలదీయడం చర్చనీయాంశంగా మారింది. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సీనియార్టీ జాబితాను రూపొందిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్టు హెచ్‌డబ్ల్యూవోలు వెల్లడించారు.


